
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 జూన్ 2024
5
తిరుపతి



నేటి నుంచి ఎస్వీయూ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అకడెమిక్ విద్యా సంవత్సరానికి ఆదివారంతో వేసవి సెలవులు ముగిశాయి. సోమవారం నుంచి తరగతులకు ప్రారంభిస్తున్నట్లు పరిపాలనా భవనం ఉన్నతాధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ గుర్తించి విభాగాధిపతులకు తెలియజేసి విద్యార్థులు సకాలంలో తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. అకడెమిక్ క్యాలెండర్‌ను సకాలంలో పూర్తిచేసి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించే విధంగా ప్రిన్సిపాల్‌ను తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు సోమవారం నుంచి తరగతులు ప్రారంభం దష్ట్యా కళాశాలకి రావాలని హాస్టల్ వసతి గహాలను కూడా సోమవారం నాడే ఓపెన్ చేయడం జరుగుతుందని, సుదూర ప్రాంతాల నుంచి ఎస్వీయూకి చేరుకునే విద్యార్థులు సకాలంలో తరగతులకు హాజరుకావాలని సూచించారు.

నవరత్న నిలయంపై దాడి

- విగ్రహాలు, శిలాఫలకాలు ధ్వంసం
- టీడీపీ పనేన్న వైసీపీ



రైతు, గ్రామీణ మహిళ విగ్రహాలు ధ్వంసమైన దృశ్యం, నవరత్నాల నిలయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్‌నగర్‌లో నిర్మించిన జగనన్న నవరత్నాల గుడిపై శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. శిలాఫలకాలను, వైఎస్సార్ చిత్రపటాలను ధ్వంసం చేశారు. నవరత్నాల నిలయం ముందు నిర్మించిన రైతు గ్రామీణ మహిళ విగ్రహాలను కూడా కూలదోశారు. ఇదంతా టిడిపి నాయకుల పనేనంటూ వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారు. రాజకీయ కక్షా వేధింపుల్లో భాగంగానే ఇలాంటి దుష్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. రాజీవ్‌నగర్‌లో సుమారు 2వేల మంది పేదలకు జగనన్న కాలనీ పేరిట ఇంటి స్థలాలను ఇచ్చారు. కాలనీకి ముందు అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి జగన్‌కు కతజ్ఞతగా నవరత్నాలు నిలయాన్ని నిర్మించారు. ఈ నిలయంలో నవరత్నాలు పథకాలను ప్రతిబింబించేలా కట్టడాలు, వైయస్సార్ చిత్రపటాలు, రైతులు, పల్లెటూరి దంపతుల విగ్రహాలు, ఫిర్యాదులు పెట్టి కూడా ఏర్పాటు చేశారు. అయితే ఏడాది జూన్ 4న టిడిపి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 40 మందికి పైగా ఆటోలలో హల్చల్ చేస్తూ నవరత్నాల గుడిపై దాడి చేసినట్లు సమాచారం. అంతేకాకుండా శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రోడ్డు మార్గంలో రాజీవ్‌నగర్ పరీవాహక ప్రాంతమంతా కొందరు వైసిపి నాయకులు ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న అక్రమ కట్టడాలను కూడా కూలదోసే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఆ కట్టడాలలో మీటర్లు పగలగొట్టి, బోర్లలో పైపులు బయటకు లాగి మోటరు ఎత్తుకెళ్లారని, ఆ సమయంలో గస్తీకి వచ్చిన పోలీసులను చూసి ఆ దుండగులు పారిపోయినట్లు సమాచారం. ఈ విషయంపై టూటౌన్ పోలీసులను వివరణ కోరగా తమకు మున్సిపల్ అధికారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేయడం గమనార్హం.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ యుటిఎఫ్ చిత్తూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం ఐరాలలోని గౌరీ శంకర కళ్యాణమండపం జిల్లా అధ్యక్షులు ఎం సోమశేఖర నాయుడు అధ్యక్షతన జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతనంగా అధికారంలోకి రాబోతున్న తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమికి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల ఔనత్యాన్ని పెంచే విధంగా ప్రభుత్వ పోకడలు ఉండాలని, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, ఇచ్చిన మాట ప్రకారం 117 జీవోను రద్దు చేస్తూ పాఠశాల విలీన ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిపిఎస్ రద్దు హామీని కూడా నిలబెట్టుకోవాలని అధికారం చేపట్టబోయే ప్రభుత్వాన్ని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన బోధన కలిగించే విధంగా ఉపాధ్యాయులకు అవకాశం ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లాలని అన్నారు. మేధావులు, విద్యారంగా శ్రేయోభిలాషుల అభిప్రాయాలను పరిగణలో తీసుకుని ముందుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్. మణిగండన్, జిల్లా గౌరవ అధ్యక్షులు పి.సుధాకర్‌రెడ్డి, సహాధ్యక్షులు పిఆర్.మునిరత్నం, రెహానా బేగం, కోశాధికారి కె.ప్రసన్న కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.దీనావతి, సిపి ప్రకాష్, ఎస్‌పి.బాషా, మాజీ గౌరవ అధ్యక్షులు జి.రాధాకష్ణ, జిల్లా కార్యదర్శులు ఎ.కష్ణమూర్తి, కె.రెడ్డెప్ప నాయుడు, డి.ఏకాంబరం, గాలి సురేష్, టి.దక్షిణామూర్తి, కె.సరిత, బి.ఈశ్వర మహేంద్ర, పి.సురేష్, కె.గణేష్ కుమార్, అన్ని మండలాలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కౌన్సిలర్లు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో నారాయణ ప్రభంజనం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: జెఈఈ అడ్వాన్స్ ఫలితాలలో నారాయణ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో ప్రభంజనం సష్టించారని ఆ కళాశాల డీజీఎం కొండలరావు తెలిపారు. స్థానిక ఎమ్మార్పల్లి సర్కిల్ వద్ద ఉన్న నారాయణ కళాశాలలో ఆదివారం అయన విలేకర్లతో మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన జోష్మిత ఈడబ్ల్యూఎస్‌పిడబ్ల్యూ ఆల్ ఇండియా ఒకటవ ర్యాంక్, ఓపెన్ క్యాటగిరిలో వివేకానంద 324, పుస్కార 886, వివస్వతి 1008, దినేష్ ప్రసాద్ 1366, జస్వంత్ 1892, హితేష్ 2438, ప్రకాష్ 2617, మైత్రిశ్రీ 3338, ఆదిత్య నివాస్ 6938, బాలాజీ7151, కిరణ్ కుమార్ 7380, వెంకటేష్ 8739, నాగ శ్వేత8754, జ్ఞాన తేజ వర్మ 9024 వంటి ఓపెన్ క్యాటగిరి ర్యాంకులతో పాటు 1, 42, 122, 174, 409, 435, 453, 691, 773, 905 ర్యాంకులతో పాటు దాదాపు 50మందికి పైగా ఐఐటి సీట్లు, వందకు పైగా ఎన్ఐటి, ఐఐఐటి సీట్లు సాధించే అవకాశం ఉందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో కోర్ డీన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు ఫణీంద్ర చౌదరి, విజయ్ కుమార్, శ్రీనివాసరావు, చిట్టిబాబు, దుర్గాప్రసాద్, ఏజీఎం గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ప్రెస్‌క్లబ్ కమిటీ ఘన నివాళి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఎంతోమంది ఉజ్వల భవిష్యత్తుకు జర్నలిజం ద్వారా బతుకు జీవనాన్ని కల్పించిన అక్షర యోధుడు, ఈనాడు గ్రూప్ ఆఫ్ సంస్థ అధినేత రామోజీరావుకు తిరుపతి ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సంతాప సభను నిర్వహించి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ లక్షల మందికి జర్నలిజం ద్వారా ఉపాధి కల్పించి వారి జీవితానికి బాటలు వేసిన గొప్పదార్శికుడు రామోజీరావు అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ, సీనియర్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే రామోజీరావుకు కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం అధ్యక్షులు పురంధర్ నాయుడు, కార్యదర్శి గుర్రప్ప నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమూరి జయరాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ సంతాప సభ, నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు.



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రెస్‌క్లబ్ కమిటీ

బొజ్జలది ప్రజావిజయం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి బియ్యపు మధుసూదన రెడ్డిని అరాచకపాలనపై విజయం సాధించిన బొజ్జల సుధీర్ రెడ్డిది ప్రజావిజయం అని టీడీపీ సాంస్కతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి అన్నారు. మధుసూదన్ రెడ్డి దుర్మార్గాలను అరికట్టడానికి ప్రజలంతా ఒక్కతాటిపై వచ్చి సుధీర్ రెడ్డికి అఖండ మెజారిటీ ఇచ్చారని గుర్తు చేశారు. సుధీర్ రెడ్డి విజయంలో కీలక భూమిక పోషించిన బొజ్జల రిషితారెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం టీడీపీ బీసీ విభాగం నాయకులు ఘనంగా జరిగాయి. లక్కమనేని మధుబాబు, డాక్టర్ యం.ఉమేష్ రావు, మదనమోహన్, పూల శేఖర్, శివ, బాలయ్య, గురుమూర్తి, నాగమ్మ, సుబ్రమణ్యం, సులేమాన్, సురేష్, నున్నా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పూర్వవైభవం తీసుకురావాలి

ఎమ్మెల్యే నానిని కోరిన నోబెల్ టీచర్స్ అసోసియేషన్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో పూర్వ విద్యావిధానాలను తీసుకొచ్చి పూర్వవైభవాన్ని సంతరించుకునేలా నూతన కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని ఆదివారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎం.రెడ్డి రమేష్‌బాబు, టి.సురేష్ కుమార్, విజయ ప్రకాష్ నాయుడు, భాస్కర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం తిరుపతి రూరల్ పరిధిలోని రఘునాథ రిసార్ట్స్‌లోని పులివర్తి నాని నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిసి తమ విజ్ఞప్తిని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దు చేసి డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తికి ఎమ్మెల్యే పులివర్తి నాని సానుకూలంగా స్పందించి త్వరలో ముఖ్యమంత్రి దష్టికి ఈ విన్నపాన్ని తీసుకొని వెళ్తామని హామీ ఇచ్చారన్నారు.

నగర వనానికి 'జంగిల్ రైడర్'



ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): తిరుపతి నగరపరిధిలోని అటవీశాఖ ఆధీనంలో ఉన్న తిరుపతి నగరవనంను సందర్శించే వారి కోసం అటవీశాఖ అధికారులు జంగిల్ రైడర్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ వాహనాల ద్వారా దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల పరిధిలో ఉన్న తిరుపతి నగరవనం అందాలను ఈ జంగిల్ రైడర్ వాహనం నడుపుతూ తిలకించడానికి అధికారులు నాలుగు వాహనాలను తీసుకొచ్చారు. ప్రస్తుతం నగరవనం నూతన శోభను సంతరించుకుంటున్న తరుణంలో ఈ వాహనాలను తీసుకురావడం వల్ల సందర్శకుల సంఖ్య ఎక్కువగా పెరిగే అవకాశం ఉంటుందని, దీంతో పాటుగా సందర్శకులకు ఈవాహనం నడుపుతూ నగరవనాన్ని చూడడం కొత్త అనుభూతిని కలిగిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఒక్కో జంగిల్ రైడర్ వాహనం 2లక్షల 75వేల విలువ అని, ప్రస్తుతం సందర్శకుల కోసం ప్రయోగాత్మకంగా నాలుగు వాహనాలను తీసుకొచ్చినట్టుగా అటవీ శాఖ అధికారులు తెలిపారు.

కందికుంటకు మంత్రి పదవి ఇవ్వాలి: రెడ్డిబాబు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు ఓ ప్రకటనలో కూటమి అధినేతలకు విజ్ఞప్తి చేశారు. చేనేత సామాజిక వర్గానికి చెందిన కందికుంట వెంకటప్రసాద్‌కు మంత్రివర్గంలో చోటు కల్పిస్తే చేనేతలకు మరింత మెరుగైన సేవలు, అభివద్ధి కార్యక్రమాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వ అధినేతలు తమ విజ్ఞప్తిని స్వీకరించి కందికుంట వెంకటప్రసాద్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలన్నారు.

కూటమి అభ్యర్థి గెలుపు సంబరాలు



ప్రజాశక్తి- సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణం జనసేన పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు పొన్నా కాటయ్య, మండల కార్యదర్శి చంద్రశేఖర్ (చిన్నా) ఆధ్వర్యంలో నెలవల విజయశ్రీ సాధించిన ఘన విజయం గుర్తు చేసుకుంటూ కేక్ కటింగ్ చేసుకొని సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ ఇంఛార్జి ఉయ్యాల ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు వల్లూరు కిరణ్, నాయుడుపేట జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు కిరణ్ రాయల్, వీరమహిళ పద్మజ కామాక్షి, ప్రవీణ్, వంశీ, ప్రసన్న పాల్గొన్నారు.

'సిరి అలా వెళ్లకే' షూటింగ్ ప్రారంభం



ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): షిలోక్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై జి9 ఫిలిం ఫ్యాక్టరీ చిత్ర నిర్మాణ సంస్థ సహాయ సహకారాలతో షీలా లోకనాథన్ నిర్మిస్తున్న 'హే సిరి అలా వెళ్లకే' వెబ్ సిరీస్ చిత్రం షూటింగ్‌ను ఆదివారం తిరుపతి నగర పరిధిలోని మనస సరోవర్ హోటల్ ప్రాంతంలో ప్రారంభించారు. ఈసందర్భంగా దర్శకులు క్రిస్టోఫర్, సినీ రచయిత భరత్ మాట్లాడుతూ హే సిరి అలా వెళ్లకే చిత్రం పూర్తిగా ప్రేమకథా చిత్రమని, విభిన్న కథాంశాలతో ఈచిత్రంలో హాస్యం, బావద్వేగాలతో కూడిన సన్నివేశాలను నూతనంగా చిత్రీకరించి ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచి పెట్టాలని ఉద్దేశంతో నిర్మిస్తున్నామన్నారు. ఈ చిత్రంలో కథానాయకుడిగా సాయి, కథానాయికిగా షీలా లోకనాథన్ ముఖ్యపాత్రలో మౌనిక రాజ్, కామెడీ శాస్త్రి, వినుకొండ రవి, సుభాష్ చంద్రబోస్, గుర్రప్ప నాయుడు, భరణి కిరణ్, బేబీ అభిజ్ఞ, శోధన నటిస్తున్నారన్నారు. 32 రోజులపాటు తిరుపతి పరిసర ప్రాంతాలలో ఈ వెబ్ సిరీస్‌కు చెందిన చిత్రాన్ని చిత్రీకరిస్తామని దర్శకులు క్రిస్టోఫర్ తెలిపారు.

పేటలో రక్తదాన శిబిరం...



ప్రజాశక్తి- సూళ్లూరుపేట : రక్తదాన మాసోత్సవాలు పురస్కరించుకొని సూళ్లూరుపేట సేవా సమాఖ్య ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ నెల్లూరు సహకారంతో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంకు విశేష ఆదరణ అందిందని, 50 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారని నిర్వాహకులు షేక్.ఉస్మాన్ బాషా తెలిపారు. 20 మంది నూతన యువ రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొనడం స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం దాతలకు సర్టిఫికెట్స్ అందించారు. రెడ్ క్రాస్ మోటివేటర్ మధుసుధన్ రావు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి సహకరించాలి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి నూతన విద్యాసంస్కరణలు అమలు చేయడం ద్వారా కొలువుదీరనున్న రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లాశాఖ ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేసినట్లు ఆ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ బాబు, జగన్నాధం తెలిపారు. తిరుపతిలోని ఎస్టియు భవన్‌లో ఆదివారం జిల్లా శాఖ ప్రథమకార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో నూతన సంస్కరణలు చేపట్టాలని, తెలుగు రాష్ట్రంలో తెలుగు, ఆంగ్ల భాషల్లో బోధన సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ 117వ జీవోను వెంటనే రద్దుచేసి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను కొనసాగించాలని అన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేసి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. గత డిఎ, పిఆర్‌సి బకాయిలు, పిఎఫ్, ఏపీజీ ఎల్ఐ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి కందిపాటి ధనంజయ నాయుడు మాట్లాడుతూ నాడు- నేడు, వివిధ యాప్‌ల అప్లోడ్ నుండి టీచర్లకు విముక్తి కల్పించాలన్నారు. ఎస్టియు వ్యవస్థాపకులు ముద్దం మొయినుద్దీన్ రామోజీరావుకు ఘనంగా నివాళు లర్పించారు.

'ఆక్రమణకు గురైన భూమిని పరిరక్షించండి'

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: మండలంలోని మర్రిమంద గ్రామంలో వికతమాల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 132, 133లో 70 సెంట్లు భూమిని 20 సంవత్సరాల ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ కాలనీ, కమ్యూనిటీ భవనాల కోసం, భవిష్యత్తు అవసరాల కోసం మిగిలి ఉంచిన 70 సెంట్లు భూమిని గత వైఎస్సార్‌సిపి ప్రభుత్వంలో కొంతమంది నాయకులు ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరిపారనిసిపిఎం పార్టీ మండల కార్యదర్శి కరిముల్లా ఆరోపించారు. వారి నుంచి ఈ భూమని కాపాడలని ఎంఆర్ఓకి వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదని, ఇకనైనా ఆ భూమిని కాపాడవలసిన బాధ్యత అధికారుల మీద ఉందని డిమాండ్ చేశారు. వారి వెంట రైతు సంఘం నాయకులు కె.రంగయ్య, డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు, వెంకటేశ్వరరావు ఉన్నారు.



క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి : మస్తాన్ బాషా

ఘనంగా సమ్మర్ క్రికెట్ ముగింపు వేడుకలు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని ఫ్రెండ్లీ ఫైటర్స్ క్రికెట్ అకాడమీ (కోచ్) నిర్వాహకులు మస్తాన్ బాషా సూచించారు. ఆదివారం ఫ్రెండ్లీ ఫైటర్స్ క్రికెట్ అకాడమీ సమ్మర్ క్రికెట్ టోర్నమెంటు ముగింపు కార్యక్రమాన్ని తిరుపతి నగర పరిధిలో నిర్వహించారు. గత నెల మే 5 నుండి జూన్ 9వ తేదీ వరకు దాదాపు 36రోజులు సమ్మర్ క్రికెట్ క్యాంప్ నిర్వహించామని అన్నారు. ఈక్యాంపులో 80మంది క్రీడాకారులు ప్రతిరోజు పాల్గొన్నారని తెలిపారు. పెండ్లి ఫైటర్స్ క్రికెట్ అకాడమీ క్రికెట్ హెడ్ కోచ్ మస్తాన్ బాషా మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు అందరికీ ప్రతిరోజు వ్యాయామంతో పాటు ఆటలో ఉన్న మెలకువలను ఎంతో అనుభవంతో నేర్పించామన్నారు. 36 రోజుల వేసవి శిక్షణలో క్రీడాకారులకు 24 మ్యాచులను నిర్వహించామన్నారు. ఈ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి మెడల్స్, మొమెంటోలను అందజేశారు. ఈ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథులుగా సిడిసిఏ సెక్రటరీ గిరిధర్, టీటీడీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ ఎ.ముని వెంకటరెడ్డి, సంస్కత విద్యాపీఠం ప్రొఫెసర్ వెంకట శ్రీనివాసులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొమెంటోలను అందిస్తున్న నిర్వాహకులు

అన్నదానం



ప్రజాశక్తి-గూడూరుటౌన్: గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ఘన విజయం సాధించిన సందర్భంగా ఆదివారం చేడిమాల పంచాయతీ నల్లయ్యగారిపాలెంలో అభిమానులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నాగేశ్వరరావు, ప్రసన్నకుమార్‌లు దాతలుగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అందరికీ సుపరిచితుడైన పాశిం సునీల్ కుమార్ ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు. వారు భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: వరదయ్యపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన 1998-99 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో తమకున్న అనుభూతులను, అనుభవాలను తోటి మిత్రులతో పంచుకున్నారు. అనంతరం వివిధ రంగాలలో స్థిరపడిన మిత్రులు వారి వంతుగా పాఠశాలకు కొంత విరాళాలను సేకరించి త్వరలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వద్ద అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతి సంవత్సరం ఇలాగే మిత్రులందరూ ఒక వేదికపై కలిసే విధంగా కార్యక్రమం రూపొందించనున్నట్లు తద్వారా పాఠశాలకు ఏదో రూపన సహకారం అందించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్యనిర్వహకులు ఫజల్ రహమాన్, నవోదయ, వెంకటేష్, మోహన్, బాలాజీ తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణ పరిధిలోని హోసన్నా ప్రార్థనా మందిరంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భావోద్వేగానికి లోనయ్యారు. గూడూరు ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి సంధ్యారాణి ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రిస్టియన్ సోదరులకు అభినందనలు తెలిపారు.

వైభవంగా గంగ జాతర



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం ఎస్‌బిఆర్ పురం పంచాయతీలో సర్పంచ్ మణిరాజు ఆధ్వర్యంలో గంగజాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆదివారం తొలిరోజున అమ్మవారికి పూల గెరిగ, గ్రామ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి, ఆలయ కమిటి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

భాను విజయానికి కృషి చేసినవారందరికీ ధన్యవాదాలు: గోపికృష్ణ

ప్రజాశక్తి-క్యాంపస్: నగరి ఎమ్మెల్యేగా గాలి భాను విజయానికి కృషి చేసినవారందరికీ తెలుగు యువత రాష్ట్ర నాయకులు శాఖమూరి గోపికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయన తిరుపతిలో మాట్లాడుతూ గాలి భానుకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

వైభవంగా వినాయకస్వామి ఊరేగింపు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం గోవర్ధ నగిరి గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక స్వామి వారి ఆల య మండలాభిషేకం వేడుకగా నిర్వహించారు. సాయ ంత్రం స్వామి వారు గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తు లకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతుల సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను గోవర్ధనగిరి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

ఫోరం ఫర్ ఆర్టిఐ కార్యాలయం ప్రారంభం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలో రాయలసీమ జోన్ ఫోరం ఫర్ ఆర్టిఐ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ నూతన కార్యాలయాన్ని ఫోరం ఫర్ ఆర్.టి.ఐ నేషనల్ జాయింట్ సెక్రటరీ అజయ్ ప్రసన్నకుమార్ రాయల్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చంద్రకళారెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, సెక్రటరీ ప్రసాద్, అధికార ప్రతినిధి చంద్రశేఖర్, తిరుమల టౌన్ అధ్యక్షులు ఆవుల సుబ్బు, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ తదితరులు కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ శాఖల నుండి కోరిన సమాచారాన్ని అవసరమైన వ్యక్తులకు ఇప్పించడానికి ఆర్టిఐ చట్టం ద్వారా తగిన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, రాయలసీమ జోన్ పరిధిలో తిరుపతి ప్రధాన కేంద్రంగా నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు.

ఎంవీ యాక్టును రద్దు చేయాలి: సీఐటీయూ




సమావేశంలో ప్రసంగిస్తున్న బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: 2019లో అమలు చేసిన ఎంవీఐ యాక్టిను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో పుత్తూరు లారీ డ్రైవర్స్ యూనియన్ సమావేశం ప్రశాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత డ్రైవర్లకు ఉరుతాడైన మోటర్ వెహికల్ చట్టాన్ని సవరించి, 2019మోటరు వెహికల్ చట్టాన్ని తీసుకొచ్చి డ్రైవర్ల జీవితాలతో చలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి సవరణ చేసిన మోటర్ల వెహికల్ చట్టాన్ని రద్దుచేసి డ్రైవర్‌లను ఆదుకోవాలని కోరారు. కొత్తగా వచ్చే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డ్రైవర్ల పైన ఒత్తిడి లేకుండా వారికి రక్షణ కల్పించాలని వారి కుటుంబం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్లకు 2019 మోటార్ వెహికల్ చట్టాన్ని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి డ్రైవర్లకు అండగా నిలబడాలని అదేవిధంగా పెట్రోల్ డీజిల్ ధరలను జిఎస్టి పరిధిలోకి చేర్చాలని అన్నారు డ్రైవర్ల అందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పుత్తూరు డ్రైవర్ యూనియన్ నాయకులు ప్రశాంత్, కృష్ణయ్య, శివశంకర్ ప్రసాద్, మనోహర్, వేలు, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా గాలి ముద్దుకృష్ణమనాయుడు జయంతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మాజీ మంత్రి, దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు 77వ జయంతి వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పుత్తూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో ముద్దుకృష్ణమనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. ముద్దుకృష్ణమనాయుడు హయాంలో ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, షణ్ముగం రెడ్డి, గోపీనాథ్, మహేష్, బాబు నాయుడు పాల్గొన్నారు. అదేవిధంగా టీడీపీ



పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో తొర్రూరు గ్రామంలో ముద్దుకృష్ణమనాయుడు జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవికుమార్, బాలాజీ, అభిమానులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: టిడిపి ఎమ్మెల్యే థామస్, పార్లమెం టు సభ్యుడు దగ్గుమళ్ల ప్రసా దరావు అత్యధిక మెజారి టీతో విజయం సాధించ దంతో గంగాధర నెల్లూ రు మండలం తూ గుండ్రం దళితవాడ చర్చి లో టిఎన్‌టియుసి అధికా ర ప్రతినిధి జీవరత్నం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంత రం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న జాఫర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో టిడిపి164 స్థానాల్లో ఘన విజయం సాధించడంతో పాటూ చిత్తూరు నియోజక వర్గంలో గురజాల జగన్మోహన్ ఘన విజయం సాధించారు. టిడిపి అధికారంలోకి రావడం, చిత్తూరు ఎమ్మెల్యేగా గురజాల జగన్మోహన్ విజయం సాధించటంతో ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు జాఫర్ తమిళనాడులోని నాగూర్‌కు వెళ్లి గుండు కొట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో కొచ్చి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి కావాలని, చిత్తూరులో గురజాల జగన్మోహన్ విజయం సాధించాలని కోరుకున్నట్లు తెలిపారు. తన కోరిక నెరవేరడంతో నాగూరులో గుండు గీయించుకుని మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు. టిడిపి విజయానికి తనకు సహకారం అందించిన ముస్లిం మైనార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రామోజీరావుకు నివాళి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: అక్షర యోధు డు, ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావుకు మండలంలోని తూగుండ్రం గ్రామంలో పలువురు టిడిపి నాయ కులు బస్టాండు కూడలి వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్, నాయకులు శ్రీనివాసులు శెట్టి, రాఘవేంద్ర, సంపత్, దినేష్, కమల్, విమల్ పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 38 మంది ఎంపిక

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వ హించిన ఉచిత కంటి చికిత్స శిబిరానికి 79 మంది హాజరు కాగా వారిలో 38 మంది ఆపరేషన్లకు ఎంపిక అయ్యారు. డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డాక్టర్ మురళీకృష్ణ వైద్య పరీక్షలు నిర్వహించి కంటి ఆపరేషన్ 38 మందిని ఎంపిక చేశారు. వారిని చెన్నై శంకర్ నేత్రాలయ హాస్పిటల్‌కు తరలించి ఆపరేషన్ చేయించి వారి ఇంటి వద్దకు చేర్చే వరకు ట్రస్ట్ వారు ఖర్చులు భరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర నేత్రాలయ డాక్టరు మురళి కృష్ణ, డాక్ట రు శ్రీనివాసులు, చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించిన గురజాల

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ హైదరా బాద్ పర్యటనలో భాగంగా ఆదివారం ఎన్‌టి ఆర్ ఘాట్‌ను సందర్శించి నంద మూరి తారక రామారా వుకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ , చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి పరిశీలకులు పల్లెంటి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్నఉత్తర గోగ్రహణం

ప్రజాశక్తి -సోమ ల: మం డల కేంద్రమైన సోమల పంచా యతీ భారతం మిట్టలో నిర్వహిస్తున్న మహా భారత యజ్ఞంలో ఆదివా రం ఉత్తర గోగ్రహణం నాటక కళాకా రులు, ప్రజలు నిర్వహిం చారు. మహా భారత కథలో యుద్ధ ఘంటికలు మోగే ముందు ఉత్తర కుమారుడు బృహన్నల యుద్ధభూమిలో జమ్మి చెట్టు పైనున్న ఆయుధాలను తీసుకునే సందర్భంగా నిర్వహించే ఘట్టం కావడంతో వందలాది మంది ప్రజలు తిలకించడానికి మహాభారత యజ్ఞం ప్రాంగణానికి చేరుకున్నారు. దుర్యోధన వేషధారి, అర్జున వేషధారి, ఉత్తర కుమార వేషధారులు పద్యాలు పాడుతూ కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రజలు ఆశాంతం తిలకించారు. చాందిని బండిపై అర్జునుడు, ఉత్తర కుమారుడు యుద్ధభూమికి వచ్చే ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

అలరించిన దుర్యోధన వధ

ప్రజాశక్తి - కార్వేటినగరం: కొల్లాగుంటలో వెలసిన శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్స వాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి ఉషారాణి హరికథా కాలక్షేపాన్ని కన్నులకు కట్టినట్లు ఆలపించారు. మధ్యాహ్నం శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుని భీమసేనుడు గంగ మడుగు నుండి తీసుకొచ్చే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకొంది. దుర్యోధన పాత్రదారుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడిపెట్టించింది. దుర్యోధన వధ ఘట్టానికి కొల్లాగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పట్నం కాంతమ్మ, ఆర్ముగంరెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జ్యోతి ఉభయదారు లుగా వ్యవహరించారు. వార్షిక మహా భారత బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. కంకణాలు ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు వస్త్రాలు ధరించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. మహిళలు ఆలయంలో మొక్కులు చెల్లిం చారు. ఈ కార్యక్రమానికి శాంతి తులసీ రామ్ కుటుంబ సభ్యులు ఉదయ దారు లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, కమిటీ మెంబర్లు, గ్రామస్తులు, భక్తులు పలువురు పాల్గొన్నారు. కొల్లాగుంట గ్రామానికి చెందిన దొరస్వామిరెడ్డి, ధనమ్మ ఆధ్వర్యంలో బాణసంచా వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆర్‌సి పురంలో టిడిపి బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న తిరుమలరెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రపురం: చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని) అఖండ మెజారిటీతో విజయం సాధించడంతో మండల టిడిపి ఆధ్వర్యంలో ఆర్‌సీ పురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం శ్రీ భవాని శంకరాలయం వద్ద టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాయల చెరువు కట్ట కింద ఉన్న శ్రీ భవాని శంకరాలయం నుంచి కుప్పం బాదురు, తాటి తోపు కండ్రిగ, మిట్ట కండ్రిగ, పరమాల మీదుగా మహాభారతం మిట్టవరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ బైక్ ర్యాలీని మండల టీడీపీ అధ్యక్షులు తిరుమలరెడ్డి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం భారతం మిట్ట వద్ద భారీ కేకలు కట్ చేసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కోరా హరిప్రసాద్, లెక్కల సురేంద్రనాయుడు, మహేష్ నాయుడు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీను, చంద్రమౌళి నాయుడు, యూత్ నాయకుడు విక్కీ నాయుడు, మండల ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు చిరంజీవి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ నందిమంగళం గ్రామంలో గత నాలుగు రోజులుగా వాంతులు, విరోచనాలతో హాస్పిటల్లో చికిత్స పొందుతూ నందిమంగళం గ్రామం చెందిన భాస్కర్, శోభ, భవ్య(12) గత నాలుగు రోజుల క్రితం పుత్తూరు ప్రభుత్వ ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొంది మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా హాస్పిటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. అలాగే ఇంకా చాలామంది నగిరిలోను, పుత్తూరులోనూ తిరుపతిలోనూ చికిత్స పొందుతున్నారు. ఇందుకోసం పలుసార్లు అధికారులకు సిఐటియు నాయకులు వెంకటేష్ ఫిర్యాదు చేశారు. వారికి దగ్గరుండి వైద్య పరీక్షలు కోసం తీసుకెళ్లి, జిల్లా వైద్య అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి వారిని గ్రామాల్లోకి వచ్చి పరిశీలించి వారికి కావలసిన అవగాహన కల్పిస్తున్నారు. మున్సిపల్ అధికారులు తాగునీటి పైప్ లైన్ తొలగించి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సిఐటియు నాయకులు వెంకటేష్ తెలిపారు.

ఘనంగా బాలాజీ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి యువనేత, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు బాలాజీ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఊరందూరులో ఘనంగా జరిగాయి. బొజ్జల బృందమ్మ సమక్షంలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. బాలాజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కష్టకాలంలో వెన్నంటి ఉండి సుధీర్ రెడ్డి గెలుపునకు కృషి చేసిన బాలాజీ రెడ్డికి పార్టీలో



తగిన స్థానం కల్పిస్తామని బృందమ్మ హామీ ఇచ్చారు.

విద్యుత్ తీగలు తెగిపడి గొర్రె మృతి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పురపాలక పరిధిలోని పోటిపాలెం వద్దనున్న లెమన్ సిటీ లేఔట్‌లో విద్యుత్ తెగిపడి ఆదివారం గొర్రె మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు పోటు పాలెంకి చెందిన నరేష్ అనే వ్యక్తి గొర్రెలను మేపుతుంటారు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తెగి పడి గొర్రె మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.7వేలు ఉంటుందన్నారు. విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్ ద్వారా పలుమార్లు స్థానికులు తెలియజేసేందుకు ప్రయత్నించగా ఇప్పటివరకు సంబంధిత అధికారి స్పందించలేదున్నారు. ఒకవేళ మనుషులే ఉంటే పరిస్థితి ఏందని విద్యుత్ శాఖపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్కో అధికారులు స్పందించి తెగిపోయిన విద్యుత్ తీగలను పునరుద్దరించి, మూగజీవాలు, ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుకుంటున్నారు.



కార్యకర్తలకు అండగా నిలుస్తా: ఆదిమూలం



ప్రజాశక్తి - వరదయ్యపాలెం, బుచ్చినాయుడుకండ్రిగ: పార్టీ విజయానికి కష్టించి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ అండగా నిలుస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగ, కేవీబీపురం, వరదయ్యపాలెం మండలాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయన్ను ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఆదిమూలం కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రగిరి ఎమ్మెల్యేకి దివాకర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు



ప్రజాశక్తి-రామచంద్రపురం: సార్వ త్రిక ఎన్నికలలో చంద్రగిరి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన పులివర్తి నాని ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, టిడిపి నాయకుడు డాలర్ దివాకర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆదివారం రఘునాథ రిసార్ట్స్‌లోని పులివర్త నాని స్వగృహంలో ప్రత్యేకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తన గెలుపు కోసం ప్రత్యేకంగా కృషి చేసిన డాలర్ దివాకర్ రెడ్డికి ఎమ్మెల్యే నాని కృతజ్ఞతలు తెలియజేశారు.

సేవభావంతోనే గుర్తింపు: శ్రీనివాసులురెడ్డి



రవిరాజును సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సేవా భావం కలిగి ఉండడం వల్లే తగిన గుర్తింపు వస్తుందని, డాక్టర్ రవిరాజుకు అనేక గుర్తింపులు పొందారని వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షులు కేఎల్ మూర్తి, ఆర్ మాధవనాయుడు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక వర్కర్స్ భవనములో సమావేశం నిర్వహించి సన్మాన గ్రహీత డాక్టర్ రవి రాజును ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ముని కృష్ణయ్య, గుణశేఖర్ రెడ్డి, ఉషోదయ వాకర్స్ అధ్యక్షులు కోనేటి రవిరాజు, గోపికృష్ణ, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

జూలియన్ రాజు అందరికీ ఆదర్శం



ప్రజాశక్తి-రేణిగుంట: సమాజానికి ఏదైతే మేలు చేస్తామో చివరికి మిగిలేది అదే అని ఆశా సంస్థ ద్వారా సమాజానికి తన వంతు సేవలు అందిస్తున్న జూలియన్ రాజు అందరికీ ఆదర్శనీయుడని ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు అన్నారు. రేణిగుంట మండలం ఎల్ఎన్ కండ్రిగ గ్రామంలో వృద్ధులకు ఆషా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో వృద్ధులకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ మాలాంటి స్వచ్ఛంద సంస్థలకు జూలియన్ రాజు ఆదర్శమన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మునీంద్ర, శ్రీధర్, డాక్టర్ కోదండరామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: రేణిగుంటలోని చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం గోవిందవరం ఎస్టీ కాలనీ వాసులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు ప్రత్యూష మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని ప్రజలు అభ్యున్నతే ధ్యేయంగా చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలోని మహిళలు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి శ్రీనివాసులు బ్యాంక్ మిత్ర భాగ్యమ్మ, బాబు నాయుడు, భాస్కర్, శ్రీనులు పాల్గొన్నారు.

శ్రీ మిట్ట గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిద్దాం

- మొక్కల చంద్రశేఖర్ రెడ్డి



ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి శ్రీ మూలస్థాన ఎల్లమ్మ సోదరి శక్తి స్వరూపిణి శ్రీ మిట్ట గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకుందామని ఆలయ కమిటి ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన వివరాలను వెల్లడించారు. 11న మంగళవారం జాతర ప్రారంభమవుతుందన్నారు. తొలిరోజున రామిరెడ్డిపల్లి సుకన్య, శ్రీనివాసులు ఉభయదాతలుగా వ్యవహరించనున్నారు. ఉదయం కొడిస్తంభం పూజ, రాత్రి చాటింపుతో ప్రారంభమయ్యే ఈ జాతర వారం రోజులు భక్తులు వివిధ వేషధారణలతో మొక్కులు చెల్లిస్తూ 18న మంగళవారం సాయంత్రం పేరంటాల వేషం, రాత్రి విశ్వరూప దర్శనం (అమ్మవారి చెంప నరుకుట) కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ముగియనున్నట్లు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ

- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రూరల్ మండలం పరిధిలోని, ఇందిరమ్మ కాలనీ సమీపంలో రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగేంద్ర మోటారు బైక్ మీద గూడూరులో సొంత పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా అదే మార్గంలో నెల్లూరుకి చెందిన ప్రవీణ్, నాగరాజు అనే ఇద్దరు వెడిచేర్ల నుంచి నెల్లూరుకి బైక్‌పై వెళ్తుండగా ఇదే క్రమంలో ఇందిరమ్మ కాలనీ వద్ద ఎదురుగా బైక్‌లు ఢీకొనడంతో గాయాలు పాలైనారు. దీంతో 108 ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అనంతరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటగిరిలో దారుణం

- ఓ రెస్టారెంట్ వద్ద వ్యక్తి హత్య

- విచారిస్తున్న గూడూరు డిఎస్పి



ప్రజాశక్తి - వెంకటగిరి: చిన్నపాటి స్వల్పవివాదంలో ఒకరి నిండి ప్రాణం బలైంది. మద్యం దుకాణం వద్దకు వచ్చిన వ్యక్తిపై కత్తిలో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశారు. ఈ ఘటన వెంకటగిరి పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో ఉన్న ఓ రెస్టారెంట్ బార్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. సీఐ సంగమేశ్వరరావు కథనం మేరకు పట్టణంలోని బీసీకాలనీ బొప్పాపురంకు చెందిన బొక్కసం విజయ్(35) భార్య మునెమ్మలు తిరుపతి కరకంబాడి సమీపంలో ఉన్న ఓ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితం విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో బీసీకాలని తన స్వంత నివాసంకు చేరుకున్నారు. ఇక్కడ నుంచి కంపెనీకి విధులు కొనసాగిస్తున్నారు. ఆదివారం బొక్కం విజయ్ పాలకేంద్రం సెంటర్ 32 కేవీ సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ శ్రీకాహాళస్తి మండలం వెల్లంపల్లికి గ్రామానికి చెందిన నరసింహా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో విజయ్, నరసింహులు ఆదివారం బార్ అండ్ రెస్టారెంట్ వద్ద స్వల్ప వివాదం చోటుచేసుకోని మాట మాట పెరిగింది. దీంతో క్షణికావేశంకు గురైన నరసింహులు పక్కనే ఉన్న కత్తితో విజయ్ దాడి చేసి పరారయ్యాడు. రక్తపు గాయాలైన విజయ్ సమీపంలో జియో పెట్రోల్బంక్ ఆవరణంలో ఆపస్మరక స్థితిలో పడిపోయారు. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించి విజయ్ మార్గంమధ్యలో మృతి చెందారు. ఈ ఘటన తెలుసుకున్న గూడూరు డీఎస్పి సూర్యనారాయణ, సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐలు ఘటన స్థలం వద్దకు చేరుకొని స్థానికుల వివరాల మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.